కామారెడ్డి జీజీహెచ్ సందర్శన

రోగులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎంహెచ్ఎన్ సభ్యులు

కామారెడ్డి/భిక్కనూరు, నవంబర్ 18 : మాతృ ఆరోగ్య సేవల మూల్యాంకనం కోసం రాష్ట్ర ఎంహెచ్ఎన్ టీం కామారెడ్డి జీజీహెచ్‌ను సోమవారం సందర్శించింది. రోగులు, గర్భిణులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆశ వర్కర్లు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీవో ఎంసీహెచ్ డాక్టర్ అనురాధ, సౌజన్య, ప్రమీల, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. భిక్కనూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలను రాష్ట్ర స్థాయి అధికారుల బృందం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి అధికారులు జానాబాయి, వినోద్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కామారెడ్డి, నవంబర్ 18 : కామారెడ్డిలోని జిల్లా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం పలు పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. సుమారు 150 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు'

కామారెడ్డి, నవంబర్ 18 : జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో మంగళవారం 'ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు- 2024 కార్యక్రమాన్ని మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అమలుపరుస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై నాగరాజు బృందంతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

రాజంపేట్, నవంబర్ 18 : రాజంపేట మండలం కొండాపూర్‌లోని పాడిరైతు మంగళి అభిలాష్‌కు చెందిన జెర్సీ ఆవు సోమవారం మేతకు కోసం వెళ్లింది. అదే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. తనకు జీవనాధారమైన ఆవు మృతి చెందడంతో నష్టం వాటిల్లిందని, ఆదుకోవాలని బాధితుడు వాపోయాడు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ విక్టర్
- 'ప్రజావాణి'కి 66 ఫిర్యాదులు

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి, నవంబర్ 18 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. ప్రజావాణిలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో 66 వినతులను స్వీకరించామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో చందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

రాజంపేట్, నవంబర్ 18 : రాజంపేటలోని తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారని తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. సామాజిక, ఆర్థిక సర్వే, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఓటరు జాబితా తదితర అంశాలపై అదనపు కలెక్టర్ విక్టర్ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.

రేపు హాకీ సెలక్షన్స్

కామారెడ్డి రూరల్, నవంబర్ 18 : కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలో బుధవారం ఎస్‌జీఎఫ్ బాలబాలికలకు హాకీ(అండర్-14) సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు పీడీ మధుసూదన్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ హీరాలాల్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు 01-01-2011, లేదా తర్వాత పుట్టినవారు అర్హులన్నారు. గర్గుల్‌లోని జడ్పీహెచ్ఎస్‌కు ప్రతి పాఠశాల నుంచి ఐదుగురు బాలురు, ఐదుగురు బాలికలు రావాలన్నారు. బోనాఫైడ్, లంచ్ బాక్స్ తీసుకొని రావాలని సూచించారు. ఉదయం 9 గంటల వరకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9494259901, 9490015388 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మహాసభను విజయవంతం చేయండి

బాన్సువాడలో మాట్లాడుతున్న దళిత సంఘం నాయకులు

బాన్సువాడ, నవంబర్ 18 : హైదరాబాద్‌లో వచ్చే నెల 1న నిర్వహించే మాలల సింహగర్జన మహాసభను విజయవంతం చేయాలని బాన్సువాడ నియోజకవర్గ దళిత సంఘం నాయకులు కోరారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే సింహ గర్జన మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నెర్రె నర్సింహులు, ఆలిండియా అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రవి, డివిజన్ ఉపాధ్యక్షుడు చిన్నసాయిలు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి నాగభూషణం, దళిత సంఘం మండల నాయకులు గంగాధర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీని తొలగించాలని ధర్నా

మాట్లాడుతున్న ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్

బీబీపేట, నవంబర్ 18 : బీబీపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీని తొలగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం ధర్నా నిర్వహించారు. గతంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగ్గా వండపోవడంతో ఇటీవల ఏజెన్సీని తొలగించారు. వారు కోర్టుకు వెళ్లారు. కోర్టు మధ్యాహ్న భోజనం ఏజెన్సీని గతంలో పనిచేసిన వారినే నిర్వహించుకోవాలని ఆర్డర్ ఇచ్చింది. దీంతో సోమవారం పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఏజెన్సీవారు మళ్లీ పాఠశాలకు రావడంతో వారు వద్దని విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకొని ధర్నా వద్దకు ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, తహసీల్దార్ సత్యనారాయణ చేరుకొని వారితో మాట్లాడారు. కోర్టు ఆర్డర్ ప్రకారం వచ్చారని, ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదిక అందజేస్తామని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

'మహిళా శక్తి సంబురాలు'

బీర్కూర్ ఐకేపీ కార్యాలయంలో నిర్వహిస్తున్న సమావేశం

నస్రుల్లాబాద్/రాజంపేట్, నవంబర్ 18 : బీర్కూర్‌లోని ఐకేపీ కార్యాలయంలో మహిళా శక్తి సంబురాలు సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సంఘాల్లో చేరని మహిళలను గుర్తించి సంఘాల్లో చేర్పించాలని, బ్యాంకు లింకేజీ ఇప్పించడం, రుణ, ప్రమాద బీమా, డ్వాక్రా బజారు ఏర్పాటు, యూనిఫామ్ తయారీ, వడ్డీ లేనిరుణాలపై చర్చించారు. ఏపీఎం గంగాధర్, మహిళా సంఘం అధ్యక్షురాలు నాగమణి, వీవోలు పాల్గొన్నారు. రాజంపేట మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. 14 అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు సుతారి లక్ష్మి, ఏపీఎం సాయిలు, సీసీలు, అన్ని గ్రామ సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో 4,98,226 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, నవంబర్ 18 : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 4 లక్షల 98 వేల 226 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 67,905 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ వెల్లడించారు. బాన్సువాడలోని పోచారం స్వగృహంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది వానకాలంలో ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ నర్సింహులు, నాగులగామ వెంకన్న, ఎజాస్, వైస్ చైర్‌పర్సన్ మంజులాజనార్దన్‌రెడ్డి, వాహబ్, గౌస్, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సందీప్, శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

మాచారెడ్డిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక

మాట్లాడుతున్న ఏపీడీ వామన్‌రావు

మాచారెడ్డి, నవంబర్ 18 : మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదికను సోమవారం నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా 2023-24 సంవత్సరానికి మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులను ప్రజావేదికలో చర్చించారు. డీఆర్పీలు గ్రామాల్లో పదిరోజుల పాటు తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి ప్రశాంత్, ఎంపీడీవో గోపీబాబు, ఎస్ఆర్పీలు ప్రదీప్, కవిత, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు గాంధారిలో ఉర్సు

గాంధారి, నవంబర్ 18: మండల కేంద్రంలోని చుమాన్ షా వాలీ దర్గా ఉర్సును మంగళవారం నిర్వహించనున్నట్లు సదర్‌సాబ్ సయ్యద్ ముస్తఫా తెలిపారు. ఉర్సును పురస్కరించుకొని దర్గా పరిసరాలను శుభ్రం చేసి, రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఉర్సు కార్యక్రమంలో సందాల్ ఊరేగింపుతో పాటు, కవాలీ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముస్లింలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కామారెడ్డికి తరలిన బీఎస్ఆర్‌కేఎస్ నాయకులు

కామారెడ్డికి వెళ్తున్న భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం నాయకులు

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 18: చలో కామారెడ్డి పిలుపు మేరకు భవన నిర్మాణ రంగ కార్మిక సంఘ నాయకులు జిల్లా కేంద్రానికి సోమవారం తరలి వెళ్లారు. సమస్యల సాధనకు వెళ్లినట్లు వారు తెలిపారు. తరలిన వారిలో సాయిబాబు, సాయిలు, కాంతారావు, దావీద్, దుర్గాసింగ్, లక్ష్మణ్, కరీం, చందు, శివాజి, కిష్టయ్య తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
PLOT FOR SALE
★డిచ్‌పల్లి నుండి ఆర్మూర్ వెళ్లే మెయిన్ రోడ్ నుండి 50 మీటర్ల దూరంలో మార్కెట్ దగ్గర 24x76=202 Sq.yds. ప్లాట్ల ధర 20,000/- గజం మరియు 34x27=102 Sq.yds. ప్లాట్ల ధర 15,000/- గజం అమ్మకానికి కలవు.
Ph: 9396411685 / 9493984827.
NT-336743
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ధాన్యం లారీ బోల్తా : మహిళకు తీవ్ర గాయాలు

పెద్దవాగు సమీపంలో బోల్తాపడిన ధాన్యం లారీ

గాయపడిన మహిళను108లో తరలిస్తున్న పోలీసులు

లింగంపేట, నవంబర్ 18: మండల కేంద్రంలోని పెద్ద వాగు సమీపంలో సోమవారం సాయంత్రం ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడి, మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్సై ప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. టీఎస్ 29టీఏ0714 నంబరు గల లారీ లింగంపేట సహకార సంఘం నుంచి ధాన్యం తీసుకొని బాన్సువాడ డివిజన్ పరిధిలోని దుర్కి గ్రామానికి వెళ్తున్నది. లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతో పెద్దవాగు సమీపంలోని మూలమలుపు వద్ద గుంతలో బోల్తా పడింది. ఆ సమయంలో ఐలాపూర్ గ్రామానికి చెందిన మిద్దె మౌనిక తన కూతురితో రోడ్డు పక్కన నిలబడి ఉంది. ధాన్యం బస్తాలు పడడంతో మౌనిక కూతురిని రక్షించే క్రమంలో పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలోకి కూతురిని విసిరేసింది. దీంతో ఆమె కూతురు ఎలాంటి గాయాలు కాకుండా ప్రమాదం నుంచి బయటపడింది. ధాన్యం బస్తాలు మౌనికపై పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. మౌనికను చికిత్సకోసం 108లో కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని సహకార సంఘం సీఈవో పెంటయ్య సందర్శించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కుల గణన సర్వే 80 శాతం పూర్తి

లింగంపల్లి కలాన్‌లో సర్వేను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో ప్రభాకర్

నాగిరెడ్డిపేట, నవంబర్ 18: మండలంలో చేపడుతున్న కుల గణన సర్వే 80 శాతం పూర్తైనట్లు ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. మండలంలోని లింగంపల్లి కలాన్, బంజరా గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించారు. సర్వే నివేదిక ప్రతులను తనిఖీ చేశారు.

లెండి ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయాలి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే

బిచ్కుంద, నవంబర్18 : తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న లెండి ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తి చేయించాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు.. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ని కోరారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం లో భాగంగా నాందేడ్‌కు వచ్చిన మంత్రిని జుక్కల్ ఎమ్మెల్యే సోమవారం కలిసి మాట్లాడారు. లెండి ప్రాజెక్టు పనులు ప్రారంభించి సుమారు 35 ఏండ్లు కావస్తున్నా నత్తనడకన సాగుతున్నాయని, ప్రాజెక్టు పూర్తయితే జుక్కల్ నియోజక వర్గం సస్యశ్యామలమవుతుందని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వీలైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

తిప్పారంలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

గాంధారి, నవంబర్ 18: మండలంలోని తిప్పారంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని రాష్ట్ర ఆర్యక్షత్రీయ సంఘం గౌరవ అధ్యక్షుడు తానాజీరావు, జిల్లా అధ్యక్షుడు నిట్టు వెంకట్‌రావు కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శివాజీ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సదాశివనగర్ మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్ రావు, మకుందరావు, ఆనందరావు, శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.

రాంపూర్‌లో జాతీయ పశుగణన ప్రారంభం

వివరాలను నమోదు చేస్తున్న పశువైద్యాధికారి

పెద్దకొడప్‌గల్, నవంబర్ 18 : జాతీయ 21వ పశుగణనలో భాగంగా పిట్లం మండలంలోని రాంపూర్ గ్రామంలో సోమవారం పశువుల గణనను పశు గణ అభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ మాజీద్ హమాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంతు జాతుల రకాలు, పశువుల పెంపకందారులు, చిన్న, పెద్ద జంతువులు, తెలుపు, నలుపు జంతువుల సంఖ్య, ఆవులు, గేదెలు, పౌల్ట్రీ, గుర్రాలు, గాడిదలు, కుక్కలు, తదితర జాతుల వివరాలు అంచనా వేయడం జనాభా గణన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యుడు సంతోష్, సూపర్‌వైజర్ తిరుపతి, గోపాల మిత్రలు సంగమేశ్వర్, అంజనికుమార్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

రామారెడ్డి నవంబర్18: సదాశివనగర్ మండలం ధర్మారావుపేట్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం కంటివైద్య నిపుణుడు బి. హరికిషన్‌రావు కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 103 మంది విద్యార్థులను పరీక్షించారు. కార్యక్రమంలో ఆర్బీఎస్‌కే డాక్టర్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ ప్రత్యేకాధికారిగా శ్రీపతి

నిజాంసాగర్ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీపతి

నిజాంసాగర్, నవంబర్ 18 : నిజాంసాగర్ మండల ప్రత్యేకాధికారిగా పిల్లి శ్రీపతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు శ్రీపతి జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారిగా పని చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ కార్యదర్శులు, ఎన్యుమరేటర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో అనిత తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయానికి మైనార్టీల భూ విరాళం

పోచమ్మ ఆలయానికి భూమి విరాళం ప్రకటిస్తున్న మైనార్టీ సోదరులు

లింగంపేట, నవంబర్ 18: మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయానికి మైనార్టీ సోదరులు భూమిని విరాళంగా అందించారు. పోచమ్మ ఆలయ అభివృద్ధి కోసం విరాళాలు సేకరిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన మైనార్టీ సోదరులు అబ్దుల్ రషీద్, అబ్దుల్ కలీం మూడు గుంటల భూమి విరాళంగా అందించనున్నట్లు వెల్లడించారు. ఆలయానికి కులమతాలకు అతీతంగా విరాళం అందించడంపై దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం చేసిన ఉపాధ్యాయులు

బాధిత కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిరూరల్, నవంబర్ 18: తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని అకస్మాతుగా మృతిచెందడంతో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి ఆమె కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. సోమవారం పట్టణంలోని జడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న భవాని అనే విద్యార్థిని అనారోగ్యంతో మృతిచెందింది. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఉపాధ్యాయులు, సిబ్బంది అంత్యక్రియల నిర్వహణకు రూ.10వేల 100 అందజేశారు.